క్లుప్తంగా

పరామర్శ



రామమోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : సిద్దవరం ఎంపీటీసీ లక్ష్మీదేవి, పంచాయతీ నాయకుడు దివంగత రమణారెడ్డిల అల్లుడు రామమోహన్‌రెడ్డి అనారోగ్యానికి గురయి ఆసుపత్రికి వెళ్లి గుండెకు సంబంధించి స్టంట్ వేయించుకొని వచ్చారు. సమాచారం తెలిసి సోమవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పోరుమామిళ్ల రెడ్డినగర్‌లో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట మండల కన్వీనర్ సీఎం బాషా, రంగసముద్రం, టేకూరుపేట సర్పంచులు రవిప్రకాష్‌రెడ్డి, రమణారెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, ఉపసర్పంచ్ రవిచంద్రారెడ్డి, విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణరెడ్డి, నాయకులు మస్తాన్, నారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక



డి.వి.ఎస్.ఆర్.కృష్ణ



కె.రవిచంద్ర

బద్వేలు అర్బన్ : 2025–26 సంవత్సరానికి గాను బద్వేలు బార్ అసోసియేషన్‌కు సోమవారం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఇందులో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది డి.వి.ఎస్.ఆర్.కృష్ణ, ఉపాధ్యక్షుడుగా కె.రవిచంద్ర నియమితులయ్యారు. బద్వేలు బార్ అసోసియేషన్‌లో మొత్తం 71 మంది న్యాయవాదులు ఉండగా అధ్యక్ష స్థానానికి డి.వి.ఎస్.ఆర్.కృష్ణ, ఉపాధ్యక్ష స్థానానికి కె.రవిచంద్రలు మాత్రమే నామినేషన్ వేయడంతో వారిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా పి.బాలకృష్ణ వ్యవహరించారు.

అన్నదానం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శ్రీనివాసులు, చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్‌లు కమిటీ సభ్యులతో కలసి భక్తులకు అన్నదానం చేపట్టారు. ప్రతి సోమవారం వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపాలిటీలో గత కొన్నేళ్లుగా శానిటరీ మేస్త్రీగా పనిచేస్తుండే షేక్‌హసన్‌అహ్మద్ అలియాస్ బాషా సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ వాకమళ్లరాజగోపాల్‌రెడ్డి, 5వ వార్డు ఇన్‌చార్జి సింగసానిశివయ్య.. బాషా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాషా కుటుంబాన్ని పురపాలక సంఘం తరఫున అన్నిరకాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

నిబంధనలకు వ్యతిరేకంగా వెంచర్లు వేస్తే చర్యలు



నోటీసులు అందజేస్తున్న ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి

చాపాడు : పంచాయతీల ఆదాయానికి గండికొడుతూ అనుమతులు లేకుండా నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టానుసారంగా వెంచర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి పేర్కొన్నారు. చాపాడులోని జెడ్పీ హైస్కూల్ దగ్గర వెంచర్లు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులకు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ అన్ని రకాలైన ప్రభుత్వ అనుమతులు తీసుకున్న తర్వాతనే వెంచర్లు గానీ లే అవుట్‌లు గానీ వేసుకోవాలన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లు, లే అవుట్‌లు వేస్తే ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా రోడ్ల నిర్మాణం, పైపులైన్ ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు. ఈఓపీఆర్డీ వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

పాదరక్షలు పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక శాస్త్రి నగర్‌కు చెందిన డీసీసీ బ్యాంకు రిటైర్డు ఏజీఎం గోసుపాటి ఓబుళరెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా సోమవారం మైదుకూరు పట్టణంలో 50 మంది బాటసారులకు పాదరక్షల జతలతోపాటు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. శ్రీపాద వల్లభ అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో కొండల భరద్వాజరెడ్డి ఈ కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో దాతలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన తెలిపారు.

'మండే' ఎండలు



జనాలు లేక నిర్మానుష్యంగా ఉన్న నెల్లూరు రోడ్డు



గొడుగులు పట్టుకుని బయటికి వస్తున్న చిన్నారులు

భానుడు భగభగ మండిపోతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ప్రజలు ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. ప్రయాణాలను సైతం వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోజువారి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు ఉంటుండటంతో ఎండ తీవ్రతకు ప్రజలు బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారు నెత్తిన గొడుగో, గుడ్డనో వేసుకొని తిరుగుతున్నారు. మరోవైపు శీతలపానీయాల విక్రయాలు జోరందుకున్నాయి. అలాగే నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రహదారులు సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం బద్వేలులో ఎండ తీవ్రతకు ఇబ్బంది పడుతున్న వారి దృశ్యాలను సాక్షి తన కెమెరాలో బంధించింది.

– బద్వేలు అర్బన్



గొడుగు ఏర్పాటు చేసుకున్న వృద్ధురాలు



ఎండకు అలసిపోయి సేద తీరుతున్న మహిళ



నెత్తిన గుడ్డ వేసుకుని వెళుతున్న వృద్ధుడు

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాశినాయన : మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం, 7, 8, 9, 10వ తరగతులు, ఇంటర్ రెండవ సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ నిర్మల తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పాఠశాలలో అనాథలు, బడి బయట పిల్లలు, బడి మానివేసిన పిల్లలు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతులు, మైనార్టీలు, ఆర్థికంగా వెనుకబడిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సోమవారం బాలరాజుపల్లె గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సదుపాయాల గురించి తల్లిదండ్రులకు వివరించి పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ మెర్సిరాణి, సోషల్ సీఆర్‌టీ స్వాతి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కాసానగరం పాఠశాలలో..

బి.కోడూరు : మండలంలోని కాసానగరం వద్ద గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం, 7, 8, 9, 10వ తరగతులు, ఇంటర్ రెండవ సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి మూరతోటిసునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తరగతుల ప్రవేశం కోసం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపల్‌ని సంప్రదించి బాలికల ప్రవేశం కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌పై ఉక్కుపాదం మోపాలి



నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : ఉభయ తెలుగురాష్ట్రాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ అధికమయ్యాయని ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. యూనివర్సిటీలు, ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల్లో చదువుతున్న యువత బెట్టింగ్ గేమ్స్‌కు అలవాటు పడి అప్పులు చేసి, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. యువతను తప్పుదోవ పట్టించే విధంగా సెలబ్రిటీస్.. టీవీల్లో ఇస్తున్న ప్రకటనల ద్వారా కోటీశ్వరులం కావచ్చని నమ్మి మోసపోతున్నారన్నారు. పోరుమామిళ్లకు చెందిన యువకుడు తమ కుటుంబానికి అత్యంత విధేయుడిగా ఉండటంతో హైదరాబాదులో రెస్టారెంట్ ఏర్పాటు చేయించామని, అతను ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి, అప్పులు చేసి, తమకు చెప్పలేక ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. తిరుపతిలో ఇంజినీరింగ్ చదువుతున్న పోరుమామిళ్ల యువకుడు ఈ మధ్యనే ఆన్‌లైన్ గేమ్స్‌లో పది లక్షలు అప్పులు చేసి, అవి తీర్చలేక ఫైనల్ ఇయర్ పరీక్షలు రాయలేదన్నారు. విషయం తల్లిదండ్రులకు తెలిసి, ఎక్కడ కుమారుడు తమకు దూరమవుతాడన్న భయంతో నానా తిప్పలు పడి, ఆ పేద కుటుంబం అప్పులు చేసి కుమారుని అప్పులు తీర్చారని అన్నారు. ఇలా ఎంత మంది యువత బెట్టింగ్ గేమ్స్‌కు బలవుతున్నారో అంతు లేకుండా పోతున్నదని, రాష్ట్రంలో ఈ గేమ్స్‌పై కఠినంగా వ్యవహరించాలని ఆయన అధికారులను కోరారు.

ట్రేడ్ లైసెన్స్ పన్ను పెంపుపై నిలదీత

- ఎంఐజీ ప్లాట్లు కేటాయిస్తారా.. డిపాజిట్లు వెనక్కి ఇస్తారా..
- కౌన్సిల్‌లో ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు
- సమావేశానికి గైర్హాజరైన టీడీపీ కౌన్సిల్ సభ్యులు





మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు : బఠానీలు, శనగలు, వేరుశనగకాయలు, ధాన్యం వేయించడం మొదలు లాండ్రీ షాపుల నిర్వహణతో కలిపి మొత్తం 152 వ్యాపారులకు సంబంధించి ప్రస్తుతం ఉన్న ట్రేడ్ లైసెన్స్ పన్ను 50 శాతం పెంపు.. సంపద సృష్టిలో భాగమేనా అని 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సభా భవనంలో సోమవారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్‌తో సహా మొత్తం 22 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు సమావేశానికి హాజరవ్వగా.. టీడీపీ కౌన్సిల్ సభ్యులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్నడూ ట్రేడ్ లైసెన్స్ పన్ను పెంపు కౌన్సిల్‌కు రాలేదని, ఇప్పుడే ఎందుకు చర్చ అని అడిగారు. ఒకే మారు 50 శాతం పన్ను పెంచితే వ్యాపారుల పరిస్థితి ఏమిటని అన్నారు. ఈ పన్ను పెంపు అంశాన్ని ఎవరిని అడిగి అజెండాలో చేర్చారని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల దృష్టికి ఈ అంశం రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కారణంగా ఆర్థిక లోటుతో ఈ పన్నులు పెంచుతున్నారా అని వ్యంగ్యంగా అన్నారు. సంపద సృష్టిలో భాగమా అని అధికారులు వివరించాలని తెలిపారు. అప్పటి వరకు ఈ అంశాన్ని వాయిదా వేయాలని కోరారు. కమిషనర్ మల్లికార్జునను అడిగి సమాధానం చెబుతానని సమావేశానికి హాజరైన ఇన్‌చార్జి ఎంఈ దస్తగిరి చెప్పారు.

కూరగాయల మార్కెట్‌లో రేట్ల పెంపుపై..

కూరగాయల మార్కెట్‌లో రేట్ల పెంపునకు సంబంధించి ఎవరు ప్రతిపాదించారో చెప్పాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా ప్రశ్నించారు. తమ పార్టీ సభ్యులకు ఈ అంశంపై అవగాహన లేదన్నారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న 93 మంది ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు తమ ప్రభుత్వ హయాంలో ఏనాడూ వేతనాలు పెండింగ్‌లో లేవని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారికి సక్రమంగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. మురికి కాలువలను శుభ్రం చేసే కార్మికులకు ఇస్తున్న రూ.12 వేల వేతనం కూడా నెలల తరబడి ఇవ్వకుంటే ఎలా అన్నారు. గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని ఇన్‌చార్జి ఎంఈ దస్తగిరి తెలపగా, అంతకంటే ఎక్కువ నెలలే బకాయి ఉందని వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి తెలిపారు. వేతనాల చెల్లింపులో జాప్యం జరిగినప్పుడు రాచమల్లు శివప్రసాదరెడ్డి సొంత డబ్బు ఇచ్చి వారి అవసరాలను తాత్కాలికంగా తీర్చేవారన్నారు.

చెత్త వ్యర్థాల సేకరణ

కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సంబంధించి వేసిన వెంచర్‌లో అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులు ఎంఐజీ ప్లాట్లను కొనుగోలు చేశారని 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశం పెండింగ్‌లో ఉందన్నారు. డిపాజిట్లు చెల్లించిన వారికి ప్లాట్లు కేటాయిస్తారా, లేకా డిపాజిట్లు తిరిగి ఇస్తారా తెలపాలన్నారు. సంబంధిత అధికారులను పిలిపించి సమావేశం నిర్వహించాలని కోరారు. తమ వార్డులో కూడా చాలా మంది ఉద్యోగులు ఈ విషయంపై ప్రశ్నిస్తున్నారని, వారికి డిపాజిట్లు తిరిగి ఇవ్వాలని 15వ వార్డు కౌన్సిలర్ ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి కోరారు. రోజూ మున్సిపాలిటీకి సంబంధించిన చెత్త వ్యర్థాలను సేకరించేందుకు మహాశక్తి కంపెనీ టెండర్ దక్కించుకుందని ఏఈ మణిగోపాల్ రెడ్డి తెలిపారు. సదరు కంపెనీ మున్సిపాలిటీకి రోజు రూ.8,200 రాయల్టీ రూపంలో చెల్లిస్తుందన్నారు.

కౌన్సిల్ సమావేశానికి వెళ్లొద్దని ఎమ్మెల్యే వరద ఒత్తిడి !

ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన కౌన్సిల్ సమావేశానికి వెళ్లొద్దని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కౌన్సిల్ సమావేశం నిర్వహణ బాధ్యతలు తీసుకున్న ఇన్‌చార్జి ఎంఈ దస్తగిరిపై తీవ్రంగా ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఇతర పనుల కారణంగా.. సమావేశం నిర్వహణ బాధ్యతలను ఇన్‌చార్జి ఎంఈ దస్తగిరికి అప్పగించారు. కౌన్సిల్ సమావేశం కంటే ముందుగానే టీడీపీ కౌన్సిలర్లు కొంత మంది ఇన్‌చార్జి ఎంఈకి ఫోన్ చేసి సమావేశానికి వెళ్లొద్దని బెదిరించినట్లు సమాచారం. కమిషనర్ తనకు ఆర్డర్ వేశారని, ఆయన ఆదేశాలను అమలు చేయకపోతే విధి నిర్వహణలో తనకు ఇబ్బందులు ఏర్పడుతాయని తెలిపినట్లు తెలిసింది. సాయంత్రం 4 గంటలకు ఇన్‌చార్జి ఎంఈ దస్తగిరి కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరైన దస్తగిరికి ఎమ్మెల్యే ఫోన్ చేశారు. మీటింగ్‌లో ఉన్న ఆయన స్పందించలేదని సీసీకి ఫోన్ చేసి ఇన్‌చార్జి ఎంఈకి ఇవ్వాలని తెలిపారు. అప్పుడు కూడా ఇన్‌చార్జి ఎంఈ అదే సమాధానం చెపినట్లు విశ్వసనీయ సమాచారం. శనివారం ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను రాకుండా.. అధికార పార్టీ నేతలు అడ్డుకున్న విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం తప్పకపోవడంతో ఆయన సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. టీడీపీ నేతలు మళ్లీ ఇదే ప్రయత్నం చేశారు. అయినా విఫలం అయింది.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు మైదుకూరు డీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలలో పోలీసు కళాజాగృతి బృందంతో.. మత్తు పదార్థాల వినియోగంపై కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం వలన జీవితాలు నాశనమవుతాయని అన్నారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐలు ఎం.సత్యనారాయణ, రవికుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి, పోలీసు కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో క్యాన్సర్ ముప్పు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ప్రొద్దుటూరు : ప్లాస్టిక్‌ను ఎక్కువగా ఉపయోగించడం వల్ల మనుషులకు క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌తో క్యాన్సర్ అనే అంశంపై పెద్దశెట్టిపల్లె గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ కె.సుబ్బరాయుడు, కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంవీవీ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి అంతం.. అందరి పంతం



ప్రొద్దుటూరు క్రైం : ర్యాలీ ప్రారంభిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు



మైదుకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : క్షయ వ్యాధి అంతమే మనందరి పంతం కావాలని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఆస్పత్రి నుంచి ర్యాలీ ఎర్రగుంట్ల రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. టీబీ రహిత భారత్ కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆసిఫ్, సూర్యనాగలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణెమ్మ, డీపీఎంఓ శివశంకరయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, రేడియోగ్రాఫర్ రామచంద్ర, టీబీ సూపర్‌వైజర్లు రాజారత్నం, హుస్సేన్, గంగశ్రీదేవి, టీబీ, ఏఆర్‌టీ సిబ్బంది, ఆశ, ఫార్మసీ ట్రైనింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

- వైఎంఆర్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు, టీబీ సూపర్‌వైజర్ రాజారత్నం, హెచ్‌వీ సిద్దారెడ్డి, సిర్డ్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంపీ సుబ్బారెడ్డి, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మైదుకూరు : మైదుకూరులో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కరీముల్లా, క్షయ విభాగం సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు శ్రీలలిత, మన్సూర్ అహ్మద్, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, కౌమార ఆరోగ్య కౌన్సిలర్ సుబ్రహ్మణ్యం, రక్తనిల్వ కేంద్రం సిబ్బంది ఆనంద్, ఖలీల్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బీమఠంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డా.సంపత్‌కుమార్, హెల్త్‌సూపర్‌వైజర్ పుష్కరాజ్, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ల్యాబ్ టెక్నీషియన్ బీవీ రమణ, హెల్త్ అసిస్టెంట్లు ఏ.జ్యోత్స్న, ఈ.విజయలక్ష్మి, స్టాఫ్ నర్స్ రామలక్షుమయ్య, ఏఎన్ఎం లలితమ్మ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చాపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీంతో పాటు నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బంది ర్యాలీ చేశారు. వైద్యాధికారులు రాజేష్‌కుమార్, శ్రీవాణి, కావ్యమాధురి, ఓబులేసు, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, ఆశ నోడల్ ఆఫీసర్ సుకన్య, సూపర్‌వైజర్లు సరస్వతి, బాబురెడ్డి, ప్రసాద్, టీబీ సూపర్‌వైజర్ సురేష్, ఫార్మసీ అధికారి సుభాషిణి, ల్యాబ్ టెక్నీషియన్ పద్మావతి, స్టాఫ్‌నర్స్ శిల్పా, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఏఎన్ఎంలు స్రవంతి, శాంతకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్‌జీవో హోం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. సీనియర్ క్షయవ్యాధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినయ్‌కుమార్, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ సుబ్బారెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ శ్రీనివాసులు, సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

13న వెల్లాల గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

రాజుపాళెం : మండల పరిధి వెల్లాల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఏప్రిల్ 6న జరగాల్సిన ప్రవేశ పరీక్ష 13వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ పి.తులశమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థినులు ఈ పరీక్ష రాయనున్నారని ఆమె పేర్కొన్నారు. వాయిదా విషయాన్ని తల్లిదండ్రులతోపాటు విద్యార్థినులు గమనించాలని సూచించారు.

కాలనీలో వసతులు కల్పించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

మైదుకూరు : పేదలు నివసిస్తున్న సుందరయ్య కాలనీలో కనీస వసతులు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ స్థానిక నానుబాలపల్లె రోడ్డులో సుందరయ్య కాలనీ ఏర్పడి 9 ఏళ్లు అయిందని, ఇంత వరకు కనీస వసతులైన తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసులకు ఇంటి పట్టాలు మంజూరు చేయలేదని తెలిపారు. వెంటనే ఇంటి పట్టాలిచ్చి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఇళ్లకు డోర్ నంబర్లు కేటాయించాలని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. తాగునీరు సౌకర్యం లేక కాలనీ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కరెంటు మీటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్ రాజసింహ నరేంద్రకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షరీఫ్, మండల కమిటీ సభ్యులు గురయ్య, బీబీ, సుధాకర్, ఇమామ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ మహబూబ్‌నగర్‌లోని అన్ని వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజాచైతన్య యాత్రల్లో భాగంగా సోమవారం మహబూబ్‌నగర్‌లో సీపీఎం నాయకులు పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీబీ, మేరీ, ఓబులమ్మ, రవి, సాయి, నారాయణ, వెంకటలక్షుమ్మ పాల్గొన్నారు.